క్లుప్తంగా

ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు



దశరథ్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట సమీపంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దశరథ్‌నాయక్‌ను ఘనంగా సన్మానించి, ఆలయ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు సూర్య, జగన్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

మల్లురవికి శుభాకాంక్షల వెల్లువ



రవిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయనను హైదరాబాద్‌లో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని కోరారు.

బాధితుడికి చేయూత



హర్యానాయక్‌కు మేకలు అందజేస్తున్న యువజన సంఘాల సభ్యులు

కడ్తాల్: మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్‌కు చెందిన హర్యానాయక్ మేకలను ఈ నెల 18వ తేదీన దుండగులు అపహరించారు. బాధితుడిని గ్రామంలోని పలువురు యువకులు, శ్రీ సేవాలాల్ యూత్ సభ్యులు, వాస్‌దేవ్‌పూర్ కింగ్స్ యూత్ సభ్యులు ఆదుకున్నారు. ఆదివారం హర్యానాయక్‌కు రూ.20 వేలు విలువ చేసే మూడు మేకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్, లింగ, తుల సీరాం, సిద్ధూ, మల్లేశ్, విద్యాసాగర్, వినోద్, యువజన సంఘాల సభ్యులు ఉన్నారు.

రైతులకు రుణాలివ్వాలి
సర్పంచ్ ఉదయశ్రీ



సత్తయ్యను సన్మానిస్తున్న ఉదయశ్రీ

యాచారం: డీసీసీబీ ద్వారా యాచారం మండల రైతులకు దీర్ఘకాలిక రుణాలివ్వాలని, అప్పు వాయిదాల వసూళ్లల్లో వెసులుబాటు కల్పించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షురాలు, నందివనపర్తి సర్పంచ్ ఉదయశ్రీ, డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు విజ్ఞప్తి చేశారు. డీసీసీబీ చైర్మన్‌ను ఆదివారం కలిసి సన్మానించారు. నందివనపర్తి గ్రామంలో పౌల్ట్రీఫాం, గొర్రెల, మేకల పెంపకం కోసం 25 మంది రైతులు రుణాల కోసం యాచారం పీఏసీఎస్‌లో ధరఖాస్తులు చేసుకున్నారని, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. సర్పంచ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన డీసీసీబీ చైర్మన్ రుణాలు మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సీఐకి సత్కారం



ఆంజనేయులును సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన అంజనేయులను బీఆర్ఎస్ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మహేశ్, నిట్టు మహేశ్, మనీష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏదీ చెత్తశుద్ధి?

- సోలిపూర్ శివారులో డంపింగ్
- తప్పని తిప్పలు
- కనిపించని పరిశుభ్రత
- రోగాల బారిన జనం
- పట్టించుకోని అధికారులు



సోలిపూర్‌లో పేరుకుపోయిన చెత్త

షాద్‌నగర్: ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఆ ఊరి చివరే పడేస్తున్నారు. ఫలితంగా ఆ గ్రామస్తుల తిప్పలు వర్ణనాతీతం. నిత్యం యార్డు నుంచి వెలువడే దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను కాల్చడం వల్ల ఎగిసి పడుతున్న మంటల వల్ల వెలువడే పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 28వార్డులు, సుమారు 20వేల ఇళ్లు ఉన్నాయి. పట్టణ జనాభా సుమారు లక్షకు పైమాటే. ప్రతీరోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 32మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 400 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలే ఉంటున్నాయి. చెత్త సేకరణకు అధికారులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సుమారు 115మంది విధుల్లో ఉన్నారు.

చెత్తపై ఏదిసమరం?

చెత్తను సద్వినియోగం చేసుకుంటే అందరికీ ఉపయోగపడుతుంది. చెత్తను రీ సైక్లింగ్ చేద్దాం, రీ యూస్ చేద్దాం, చెత్తపై సమరం సాగిద్దాం, చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం.. అనే మాటలు మూటలుగానే మారుతుంది.

- ఇళ్లలో సేకరించిన చెత్త మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ గ్రామ శివారులో వేస్తుండడంతో ఈగలు, దోమలు విపరీతంగా చేరి గ్రామస్తులను రోగాల బారిన పడేస్తున్నాయి. గ్రామ శివారులో చెత్త వేయొద్దని స్థానికులు, గ్రామస్తులు ఏళ్లుగా వేడుకొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.
- చెత్తను తరుచుగా తగుల బెడుతుండడంతో డంపింగ్ యార్డు రావణ కాష్టంలా నిత్యం మండుతూనే ఉంటుంది.
- గుట్టలు, గుట్టలుగా పేరుకపోయిన చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలు సైతం ఉంటున్నాయి.
- చెత్తను సిబ్బందే తగులబెడుతున్నారా? లేక ఏదైనా రసాయన చర్యల వల్ల మండుతుందో అనేది తెలియడం లేదు.
- అసలే దుర్వాసన ఆపై ఘాటైన పొగతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.
- నత్తనడకన పనులు..
- షాద్‌నగర్ మున్సిపాలిటీ రోజుకు రోజుకు విస్తరిస్తూనే ఉంది. చెత్తను ఒక చోట వేసేందుకు పట్టణ శివారులోని సీఎస్‌కే వెంచర్ వెనుక భాగంలోని ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మున్సిపల్ నిధుల నుంచి సుమారు రూ.12లక్షలతో చేపడుతున్న డంపింగ్ యార్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అయితే పట్టణంలో సేకరించిన చెత్తను ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో పారబోస్తున్నారు.

ఆస్పత్రుల పాలవుతున్నాం



సోలిపూర్ గ్రామ శివారులో చెత్త వేయడం వలన గ్రామంలో విపరీతంగా ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో చాలా మంది రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

– జాకారం నర్సింలు, సోలిపూర్

పొగతో అవస్థలు పడుతున్నాం



చెత్తను కుప్పలుగా పోసి తగులబెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ కమ్ముకుంటుంది. ఈ పొగతో ఊపిరి ఆడటం లేదు. దుర్వాసన వెదజల్లుతుంది.

– సింగపొగ శ్రీశైలం, సోలిపూర్


చర్యలు తీసుకోవాలి



గ్రామ శివారులోని డంపింగ్ యార్డును తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. తద్వార తాము అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మారుతి, సోలిపూర్

పేదల వైద్యానికి ప్రాధాన్యం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: పేదల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన మమత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రస్తుతం బాధితురాలు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని మమత కుటుంబసభ్యులు రంగారెడ్డి దృష్టి తెచ్చారు. ఆయన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్యను వివరించారు. ఆమెకు మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి సంబంధించిన ఎల్‌ఓసీని రంగారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుందని రంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటొరెడ్డి, ధన్‌పాల్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బలిజగూడ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 55,56లోని భూములకు సంబంధించి కొన్నేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఆదివారం వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వీరస్వామి గౌడ్ ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందజేశారు. 60 ఏళ్లుగా గ్రామానికి చెందిన 65 మంది రైతులు భూములను సాగు చేసుకుంటున్నారని, ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేయలేదన్నారు. రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గ్రామంలో ఇటీవల చేపట్టిన రోడ్డు విస్తరణలో ధ్వంసమైన మిషన్ భగీరథ పైపులైన్‌ను పునరుద్ధరించాలని, ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, బుర్ర ఐలయ్య, సతీశ్, రాజేశ్, పవన్, రమేశ్, ముత్యాలు, రాము, రైతులు పాల్గొన్నారు.

జ్ఞానంతోనే దేశాభివృద్ధి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: జ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జ్ఞాన ప్రచార సభ ఆధ్వర్యంలో జ్ఞానవెలుగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహనీయులు జ్ఞానం ద్వారానే సమాజంలో అనేక మార్పులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. వారు చూపిన దారిలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోలి నర్సింహా, జంతుక శంకర్, భాస్కర్, వినయ్, దేవేందర్, గిరి, మహేశ్, జగదీశ్, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: మాడ్గుల మండలంలోని అర్కపల్లి గ్రామ పంచాయితీ అవరణలో ఆదివారం జ్ఞాన ప్రచార సభ నిర్వాహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులు అర్పించారు. మహనీయులు జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పులు, చైతన్యం తీసుకువచ్చారని జ్ఞాన ప్రచార నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల నరేశ్, చెన్నకేశవులు, జానీ, బిక్కు, చంద్రయ్య పాల్గొన్నారు.

జానకమ్మకు నివాళి



నివాళులు అర్పిస్తున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

మాడ్గుల: అవురుపల్లి గ్రామానికి చెందిన పట్టెం జానకమ్మ శనివారం మృతి చెందారు. ఆదివారం జానకమ్మ భౌతికాయానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం జానకమ్మ కుమారులు శ్రీనివాస్‌రావు, మురాళీధర్‌రావును పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేశ్వరరావు, లాలయ్య గౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ సుభాశ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



ఓటు ప్రాధాన్యతను వివరిస్తున్న రాజ్‌కుమార్

మంచాల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. యువత ఓటు ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. ఆదివారం మంచాలలో ఇంటింటికీ తిరిగి ఓటు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యత తెలిసినప్పుడే సక్రమంగా వినియోగించుకోగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, బీఎల్ఓలు యాదమ్మ, వరలక్ష్మి, సుశీల, గ్రామ కోఆప్షన్ సభ్యుడు బాలరాజు పాల్గొన్నారు.

అంతా రామమయం

కడ్తాల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామాల్లో రాముడి భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ప్రజలంతా రామనామ స్మరణ చేస్తున్నారు. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆదివారం ఒక ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు జంగిరెడ్డి కళాకారుల బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సాన్ని ఎల్ఈడీ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ధర్మానికి రాముడు ప్రతీక

తలకొండపల్లి: ధర్మానికి, నిష్పక్ష పాలనకు శ్రీరాముడు ప్రతీక అని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచమంతటా రామనామ జపం వినిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం (నేడు) సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేడు మద్యదివాస్, శయ్యదివాస్ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం సీతారాములకు అభిషేకం, రామతారకమంత్రం, యజ్ఞం, నక్షత్రహారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం, సాయంత్రం సీతారాముల పల్లకీసేవా, శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

ప్రత్యేక సంచిక పంపిణీ

ఇబ్రహీంపట్నం: అయోధ్య రామాలయంలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక సంచికను రూపొందించారు. ఈ సంచికను ఆదివారం ఇబ్రహీంపట్నంలో బీజేపీ కౌన్సిలర్ సత్యనారాయణ ఇంటింటికీ పంపిణీ చేశారు. రామమందిరంలో బాలరాముని ప్రతిష్ఠాపన పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలోని నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు, నూతన ఆలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాసురెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని సూచించారు. మండల పరిధిలోని గౌరిపల్లిలో ఇటీవల హన్‌మాన్ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసురెడ్డిని కోరారు. ఆదివారం ఆయన రూ.30 వేల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచ్ శ్రీశైలం, అనురాధ, నరేందర్‌గౌడ్, ఎల్లమ్మ, తిరుపతయ్య, బాలురెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచాల: మంచాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరంలో పదవ తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న బాల్య మిత్రులు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి బాల్య స్మృతులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ప్రహ్లాదు, మాదవరెడ్డి, నర్సింహారెడ్డి, ఖాజా పటేల్, శివకుమార్‌ను సన్మానించారు.

నష్టపరిహారం ఇప్పించండి



కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో నిర్మించిన డీ–82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని స్థానిక నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో కసిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భూములు కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా నష్ట పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అవురుపల్లి గ్రామ సర్పంచ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటయ్య గౌడ్ ఉన్నారు.

ఘనంగా జ్ఞానయజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామానికి చెందిన గుర్రం తిరుపతయ్య, లత దంపతులు హైదరాబాద్ బీఎన్‌రెడ్డి నగర్‌లోని పరాశర ఆశ్రమంలో ఆదివారం శ్రీ మద్భగవద్గీత జ్ఞానయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం, సర్వదేవతాపూజలు, యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయి, దివ్య, చంద్రమౌళి, శశికళ, గుర్రం కృష్ణయ్య, ఆనంద్, పృథ్వీరాజ్, భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి తండ్రి బచ్చిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ జూలురి రమేశ్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బాలకృష్ణ, పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.